క్లుప్తంగా

బాధిత కుటుంబాలకు ఆర్థిక భరోసా



పామర్రు: అనారోగ్య బాధిత కుటుంబాలకు సీఎం సహాయ నిధి నుంచి నగదుని అందించి సకాలంలో ఆదుకుంటున్నట్లు పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ అన్నారు. స్థానిక శాసన సభ్యుల కార్యాలయంలో కనుమూరు గ్రామానికి చెందిన కోలవెంటి అనితకు సీఎం ఆర్‌ఎఫ్ నుంచి రూ.65వేల ఆర్థిక సాయం చెక్కును శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అనారోగ్యంతో బాధ పడుతూ వైద్య ఖర్చులు లేక ఇబ్బందులు పడుతున్న వారికి ప్రభుత్వం నుంచి ఆర్థిక భరోసా కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కెఆర్‌వి, పామర్రు మండలం వైఎస్సార్ సీపీ యువజన విభాగం నాయకుడు కొడాలి సురేష్, రాజశేఖర్ పాల్గొన్నారు.

కైకలూరు రూరల్ సీఐగా కృష్ణకుమార్



కైకలూరు: నియోజకవర్గ రూరల్ సీఐగా బి.కృష్ణ కుమార్ కైకలూరు కార్యాలయంలో శుక్రవారం విధుల్లో చేరారు. రూరల్ పరిధిలోని ఎస్సైలు మర్యాదపూర్వకంగా ఆయనను కలసి మండల పరిస్థితులను వివరించారు. భీమవరం టూటౌన్‌లో పనిచేసిన కృష్ణకుమార్ కైకలూరు రూరల్ సీఐగా, ఇక్కడ పనిచేసిన వైవీవీఎల్ నాయుడును ఏలూరు రేంజ్‌కు బదిలీ చేశారు. నూతన సీఐ కృష్ణకుమార్ మాట్లాడుతూ శాంతిభద్రతల పరరక్షణలో ప్రజలు, పోలీసులు సమష్టిగా కలసి పనిచేయాలని కోరారు.

నీటి తరలింపునకు తక్షణ చర్యలు

గుడివాడ టౌన్(నందివాడ): నందివాడ మండలం కొన్ని గ్రామంలో వర్షాలు కారణంగా రోడ్లు మునిగిపోయిన గ్రామాల్లో పర్యటించి, సహాయక చర్యలు చేపట్టినట్లు తహసీల్దార్ వి భవన్నారాయణ తెలిపారు. శుక్రవారం ఆయన సిబ్బందితో కలిసి వెన్ననపూడి తదితర గ్రామాల్లో నీట మునిగిన గ్రామాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ ఒక్క ప్రాంతంలో కూడా నీరు ఇళ్లల్లో ప్రవేశించనందున ప్రజలు సురక్షితంగా ఉన్నారన్నారు. పోలుకొండ డ్రెయినేజ్ నుంచి నీరు తరలించేందుకు చర్యలు చేపట్టామని, అవి తగ్గిన అనంతరం సమాంతరంగా రోడ్లపై నిలిచిన నీరు గ్రామాల నుంచి వెళ్లిపోతుందన్నారు. ఇబ్బందికరంగా ఉన్న 63 కుటుంబాలను గుర్తించామని వారికి ఒక్కొక్కరికి ఐదు కిలోల బియ్యం, కందిపప్పు మంచి నూనె, పాలు వంటివి సరఫరా చేస్తున్నామన్నారు.

సబ్సిడీపై యూరియా పంపిణీకి ప్రధాని మోదీ కృషి

కైకలూరు: యూరియా, డీఏపీలను సబ్సిడీపై రైతులకు అందించేందుకు ప్రధాని నరేంద్ర మోదీ కృషి చేశారని కిసాన్ మోర్చా ఏలూరు జిల్లా అధ్యక్షుడు కీర్తి వెంకట్ రామ్ ప్రసాద్ చెప్పారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం యూరియా బస్తాను సబ్సిడీతో కేవలం రూ.266.50, డీఏపీ బస్తాను సబ్సిడీతో రూ.1,350కి భారత్ అనే పేరుతో అందిస్తోందన్నారు.

డ్రెయిన్లలో తూడు తొలగింపు

కైకలూరు: భారీ వర్షాల కారణంగా కైకలూరు మండలం గోపవరం, తామరకొల్లు, రామవరం వంటి ప్రాంతాల్లో డ్రెయిన్ల నీరు పల్లపు ప్రాంతాలకు చేరి వరిపంట నీట మునిగింది. సమస్యను పరిష్కరించేందుకు డ్రెయినేజీశాఖ ఆధ్వర్యంలో నర్సాయిపాలెం-భుజబలపట్నం సమీప పుల్లవ డ్రెయిన్, గోపవరం, కైకలూరు రైల్వేగేటు సమీపంలో పుల్లవ డ్రెయిన్లలో తూడు తొలగింపు పనులు శుక్రవారం చేపట్టారు. డ్రెయినేజీశాఖ జేఈఈ ఇందిర మాట్లాడుతూ రూ.11 లక్షల వ్యయంతో పుల్లవ మేజర్ డ్రెయిన్‌లో తూడు తొలగింపు పనులను చేయిస్తున్నామన్నారు.

జిమ్ కోచ్‌కు జాతీయ పతకం



గుడివాడ టౌన్: ఎన్టీఆర్ స్టేడియం జిమ్ కోచ్ మారేళ్ల వెంకటేశ్వరరావు జాతీయస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో వెండి పతకం సాధించినట్లు స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు పాలేటి శివ సుబ్రహ్మణ్యేశ్వర రావు (చంటి) తెలిపారు. స్థానిక ఎన్టీఆర్ స్టేడియం కమిటీ హాల్లో కోచ్ వెంకటేశ్వరరావును కమిటీ సభ్యులు శుక్రవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల విజయనగరం జిల్లా రాజంలో జరిగిన ఆలిండియా పవర్ లిఫ్టింగ్ పోటీల్లో తమ కోచ్ 105 కిలోల విభాగంలో పాల్గొని 405 కిలోలు బరువును ఎత్తి వెండి పతకం సాధించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్టేడియం కమిటీ సంయుక్త కార్యదర్శి పర్వతనేని ఆనందు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే సీఎం జగన్ లక్ష్యం

పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్



దేవరపల్లిలో మహిళకు ధ్రువీకరణపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్

తోట్లవల్లూరు: అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ అన్నారు. మండలంలోని దేవరపల్లి సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న సురక్ష ద్వారా ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. మండల వ్యాప్తంగా సుమారు 5,200 మందికి వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలను ఉచితంగా అందించటం చాలా సంతోషంగా ఉందన్నారు. గ్రామ సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ ద్వారా దేశంలోనే ఆదర్శపాలనకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారన్నారు. రూ. 3.50 కోట్లతో తోట్లవల్లూరు-ఉయ్యూరు ఆర్ అండ్‌బీ రోడ్డు ఐదు కిలోమీటర్ల మేర అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, మిగిలిన రోడ్డు అభివృద్ధికి కూడా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అలాగే ఉయ్యూరు-ఐలూరు రోడ్డు కూడా అభివృద్ధి చేస్తామన్నారు.

రైతులను ఆదుకుంటాం

అకాలవర్షాల కారణంగా నష్టపోయిన రైతులను అన్ని విధాలా ఆదుకుంటామని అనిల్‌కుమార్ తెలిపారు. ఈ విషయమై ఇప్పటికే కలెక్టర్ రాజబాబుతో మాట్లాడటం జరిగిందని, వ్యవసాయ, రెవెన్యూ సిబ్బంది నష్టపోయిన రైతుల వివరాలు సేకరిస్తారని చెప్పారు. వరిపొలాలు నీటి ముంపునకు గురైన రైతులకు అవసరమైన సాయం అందించేందుకు తనవంతు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు.

టీడీపీది నీచ రాజకీయం

ప్రకృతి విపత్తులను కూడా రాజకీయం చేస్తూ పబ్బం గడుపుకునే నీచ సంస్కృతికి టీడీపీ నాయకులు దిగజారారని ఎమ్మెల్యే అనిల్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. ఏది జరిగినా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యేనైన తనకు ఆపాదించటం అలవాటుగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి దుష్టశక్తులను తరిమికొట్టి, ప్రజా సంక్షేమం కోసం పాటుపడుతున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి అండగా ఉండాలని కోరారు. ఎంపీపీ ఈడ్పుగంటి రాజామణి, జెడ్పీటీసీ సభ్యుడు జొన్నల రామ్మోహన్‌రెడ్డి, మండల ప్రత్యేకాధికారి నారాయణరెడ్డి, సర్పంచ్ మరీదు వెంకటేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు కళ్లం వెంకటేశ్వరరెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ నడకుదురు రాజేంద్ర, ఎంపీడీఓ స్వర్ణలత, తహసీల్దార్ కుసుమకుమారి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ జొన్నల బ్రహ్మానందరెడ్డి, వైస్ ఎంపీపీ కళ్లం శివారెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు లక్ష్మి, ఉప సర్పంచ్ కిరణ్‌కుమార్ రెడ్డి, నాయకులు చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శి సుభాష్‌కుమార్ పాల్గొన్నారు.

ముంపు తొలగింపు చర్యలు వేగవంతం చేయండి

తోట్లవల్లూరు: వరిపొలాల్లో ముంపు తొలగింపునకు అవసరమైన చర్యలను వేగవంతం చేయాలని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ అధికారులను ఆదేశించారు. మండలంలోని దేవరపల్లి, తోట్లవల్లూరులో నీటిముంపునకు గురైన వరిపొలాలను శుక్రవారం సాయంత్రం ఆయన సందర్శించటంతో పాటు ఆయా గ్రామాల్లోని మురుక్కోడు, ఏనుగుల కోడు డ్రెయిన్లను అధికారులతో కలిసి పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అకాలవర్షాల కారణంగా వందలాది ఎకరాలు నీటిముంపులో చిక్కుకున్నాయని, ఆయా పొలాల్లో నీరు త్వరితగతిన బయటకు వెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ఏనుగులకోడు డ్రెయిన్, దేవరపల్లి వద్ద మురుక్కోడులో పూర్తిస్థాయిలో గుర్రపుడెక్క, తూటుకాడ తొలగింపును వేగవంతం చేయాలని సూచించారు. జెడ్పీటీసీ సభ్యుడు జొన్నల రామ్మోహన్‌రెడ్డి, ఈఈ విజయలక్ష్మి, డీఈఈ గణపతి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కళ్లం వెంకటేశ్వరరెడ్డి, డీసీఎంఎస్ డైరెక్టర్ కిలారం శ్రీనివాసరావు, పెనమకూరు సర్పంచ్ గంగాభవాని, ఎంపీటీసీ సభ్యుడు మధుబాబు, నాయకుడు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఏసు బోధనలు అనుసరణీయం

ఎమ్మెల్యే డీఎన్నార్



చర్చి శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే డీఎన్నార్

ముదినేపల్లి రూరల్/కైకలూరు: మానవాళికి ప్రభు ఏసు దీవెనలు అనుసరణీయమని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) పేర్కొన్నారు. ముదినేపల్లి మండలం ప్రత్తిపాడు చర్చి శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా శుక్రవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చర్చి నిర్మాణం త్వరగా పూర్తి చేసుకోవాలని సూచించారు. అనంతరం గ్రామంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. తర్వాత గ్రామంలో ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఫ్రైడే డ్రై డే ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమాల్లో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంట సంధ్య, మండల పార్టీ అధ్యక్షులు మోట్రు ఏసుబాబు, బీసీ నాయకులు కోమటి విష్ణువర్ధన్, పీఏసీఎస్ అధ్యక్షుడు బొప్పన ప్రసాద్, గంట కోటేశ్వరరావు, మెరుగుమాల వెంకటేశ్వరరావు, వెన్నెల పరమానందం, బల్లవరపు సామ్యూల్, బ్రదర్ జార్జ్ కోర్నెలిష్, గొట్రూ సల్మాన్ రాజు, గుమ్మడి నాని పాల్గొన్నారు.

మంటాడ గ్రామాభివృద్ధికి సహకరిస్తా



ధ్రువీకరణపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్, ప్రజాప్రతినిధులు

పమిడిముక్కల: మంటాడ గ్రామాభివృద్ధికి సహకారం అందిస్తానని ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ అన్నారు. మంటాడ సచివాలయంలో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన గ్రామసభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామంలోని రహదారులన్నింటినీ ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి చేస్తామన్నారు. ఇందిరమ్మ కాలనీలో రూ.90 లక్షల వ్యయంతో రోడ్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయని తెలిపారు. అనంతరం 1611 మందికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుధాప్రవీణ్, తహసీల్దార్ రాజ్యలక్ష్మి, రాష్ట్ర రెడ్డిక కార్పొరేషన్ డైరెక్టర్ కంభపు రాంబాబు, వైస్ ఎంపీపీ కొడమంచిలి మహేష్, ఎంపటీసీ మేరుగ లక్ష్మి, సర్పంచ్ ఎస్.వీరమ్మ, సచివాలయ కన్వీనర్లు కోడేబోయిన కోటేశ్వరరావు, దారపు రమాదేవి పాల్గొన్నారు.

అక్రమ రవాణాను సమష్టిగా అరికట్టండి



సమావేశంలో మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసులు

కైకలూరు: మానవ అక్రమ రవాణాను సమష్టిగా పనిచేసి అరికట్టాలని కైకలూరు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి బి.శ్రీనివాసులు పేర్కొన్నారు. ఈ నెల 30న జరుగు 'వ్యక్తుల అక్రమ రవాణాకు వ్యతిరేకంగా ప్రపంచ దినోత్సవం' సందర్భాన్ని పురస్కరించుకుని బార్ అసోషియేషన్ ఆధ్వర్యంలో వెలుగు కార్యాలయంలో నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సుకు ముఖ్య అతిథిగా జడ్జి శుక్రవారం విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కువగా బాలికలు, మహిళలు అక్రమ రవాణాకు గురువుతున్నారన్నారు. పలు చట్టాలు మహిళలకు అండగా నిలుస్తున్నాయని తెలిపారు. డ్వాక్రా మహిళలు, అంగన్‌వాడీ కార్యకర్తలు ఇటువంటి అక్రమ రవాణాను గుర్తిస్తే వెంటనే పోలీసు శాఖకు తెలియచేయాలని సూచించారు. కార్యక్రమంలో కైకలూరు బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎంవీవీ సత్యనారాయణ, జనరల్ సెక్రటరీ బి.లక్ష్మణరావు, ఏపీపీ శ్రీరామచంద్రమూర్తి, న్యాయవాదులు రాజు, శంకర్ శాస్త్రి, రమాదేవి, డీ.శివ ప్రసాద్, ఎండీ గాలిబ్, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సూపరింటెండెంట్ బి.రాంబాబు, ఏఎస్ఐ మల్లికార్జునరావు, సీడీపీఓ లావణ్య, ఏపీఎం సత్యనారాయణరావు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఎంపీడీఓ మృతి

మండవల్లి: రిటైర్డ్ ఎంపీడీఓ డి.రామారావు శుక్రవారం గుడివాడలో మృతి చెందారు. మండవల్లి ఎంపీడీఓగా గతంలో ఆయన పనిచేశారు. రామారావు మృతి పట్ల ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు.

ప్రత్యేక పూజలో హాస్యనటుడు



పామర్రు: ప్రముఖ హాస్య నటుడు తుర్లపాటి శాంతకుమార్ శుక్రవారం పామర్రులోని రుక్మిణీ సత్యభామాసమేత వేణుగోపాల స్వామి ఆలయంలో ఆయన పూర్వీకులు నిర్మించిన శ్రీవీరాంజనేయస్వామి దేవాలయంలో శాంతకుమార్ తన కుటుంబ సభ్యులతో వచ్చి స్వామికి ప్రత్యేక పూజలు చేశారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి



మొక్కలు నాటుతున్న ఆర్డీఓ పద్మావతి



గుడివాడ మండల పరిషత్ కార్యాలయం వద్ద మొక్కలు నాటుతున్న ఎంపీపీ, జెడ్పీటీసీ



తోట్లవల్లూరులో మొక్కను నాటుతున్న ప్రత్యేకాధికారి నారాయణరెడ్డి, ఎంపీపీ రాజామణి



పామర్రులో మొక్కలు నాటిన ఎంపీపీ అశోక్‌కుమార్



మొవ్వలో మొక్కలు నాటుతున్న జెడ్పీటీసీ, ఎంపీపీ

గుడివాడ టౌన్: మొక్కలు నాటాల్సిన బాధ్యత ప్రతి పౌరుడి పై ఉందని గుడివాడ ఆర్డీఓ పద్మావతి అన్నారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఆమె ఉద్యోగులతో కలిసి మొక్కలు నాటే కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ ప్రస్తుతం మారుతున్న వాతావరణ అసమానతలకు పర్యావరణ లోపమే కారణం అన్నారు. దీన్ని నివారించాలంటే మొక్కలు నాటడం ఒక్కటే మార్గం అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గుడివాడ డివిజన్లో అన్ని కార్యాలయాల్లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో ఏఓ కే సత్య సులోచన, డీటీ బాలాజీ పాల్గొన్నారు.

పెదపారుపూడిలో..

పెదపారుపూడి: రాబోయే భవిష్యత్ తరాల మనుగడ ఉండాలంటే కచ్చితంగా మొక్కల పెంపకం ఉండాలని తహసీల్దార్ వి.నాగభూషణం అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆవరణలో శుక్రవారం ప్రపంచ ప్రకృతి పర్యావరణ దినోత్సవం పురస్కరించుని మొక్కలను నాట్టారు. వీఆర్వోలు అజయ్‌కుమార్, శ్రీనివాస రావు, ప్రసాద్ పాల్గొన్నారు.

తోట్లవల్లూరులో..

తోట్లవల్లూరు: పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ పాటుపడాలని తోట్లవల్లూరు మండల ప్రత్యేకాధికారి బీఎస్ నారాయణరెడ్డి తెలిపారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకుని మండల వ్యాప్తంగా సచివాలయ సిబ్బంది, మహిళా ఉద్యోగులు, వలంటీర్లు సుమారు 500 మొక్కలు నాటారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ప్రత్యేకాధికారి నారాయణరెడ్డి మొక్కలు నాటారు. ఎంపీపీ ఈడ్పుగంటి రాజామణి, ఎంపీడీఓ తుంగల స్వర్ణలత, తహసీల్దార్ కుసుమకుమారి, డీటీ ధనలక్ష్మి పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ

గుడ్లవల్లేరు: మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ చేకూరుతుందని గుడివాడ ఆర్డీఓ పి.పద్మావతి అన్నారు. ప్రపంచ పకృతి పరిరక్షణ దినోత్సవం సందర్భంగా గుడ్లవల్లేరులో శుక్రవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆమె చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీడీఓ డి.శ్రీనివాస్, తహసీల్దార్ అబ్దుల్ రెహ్మాన్ మస్తానా, డీటీ బి.కనకదుర్గ, ఈఓపీఆర్డీ వి.దిలీప్ కుమార్ పాల్గొన్నారు.

పమిడిముక్కలలో..

పమిడిముక్కల: పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలని సర్పంచ్ జంపాన ధనలక్ష్మి పేర్కొన్నారు. ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం తాడంకి హైస్కూల్‌లో పేరెంట్స్ కమిటీ చైర్మన్ కంభపు రాంబాబుతో కలిసి మొక్కలు నాటారు. ఉపాధ్యాయులు రవికుమార్, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి

గుడివాడరూరల్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీపీ గద్దే పుష్పరాణి అన్నారు. మండలపరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ పుష్పరాణి, జడ్పీటీసీ సభ్యుడు గోళ్ల రామకృష్ణ, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు మట్టా జాన్‌విక్టర్‌లు అధికారులతో కలసి శుక్రవారం మొక్కలు నాటారు. ఎంపీడీఓ వెంకటరమణ, వైఎస్సార్ సీపీ నాయకుడు వెంకటరామాంజనేయులు(రాము), ఈఓపీఆర్డీ దేవరపల్లి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మొవ్వలో..

మొవ్వ: మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని జెడ్పీటీసీ సభ్యురాలు రాజులపాటి పార్వతి పేర్కొన్నారు. మండలంలో వనమహోత్సవం కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సీడీపీఓ, ఎంపీడీఓ తదితర కార్యాలయాల్లో మొక్కలు నాటారు. ఎంపీపీ కొండేటి ఇందిర, సీడీపీఓ భానుమతి, తహసీల్దార్ వీరాంజనేయులు పాల్గొన్నారు.

పామర్రులో..

పామర్రు: స్థానిక పంచాయతీ కార్యాలయంతోపాటు మండల పరిధిలోని పలు ప్రభుత్వ కారాయలయాల్లో ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్ శుక్రవారం మొక్కలునాటారు కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు శ్రీనివాసరావు, రమాదేవి, సర్పంచ్ కస్తూరి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన 'జగనన్న సురక్ష'



ధ్రువీకరణపత్రాలు అందజేస్తున్న మున్సిపల్ కమిషనర్

గుడివాడ టౌన్: పట్టణానికి చెందిన 16, 35 వార్డు సచివాలయాలలో జగనన్న సురక్ష కార్యక్రమం శుక్రవారం కూడా కొనసాగింది. స్థానిక 35 వార్డు సచివాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ పాల్గొన్నారు. లబ్ధిదారులకు జగనన్న సురక్ష కార్యక్రమం ప్రాముఖ్యతను వివరించారు. 22మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. 531 మంది లబ్ధిదారులకు వివిధ రకాలకు చెందిన ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు దుక్కిపాటి శశిభూషణ్, పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ నరసింహారావు, నాయకులు గగారిన్, కూర్మ రాజు పాల్గొన్నారు.

■ స్థానిక 16వ వార్డులో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ రంగారావు పాల్గొని జగనన్న సురక్ష ప్రయోజనాలు ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో భాగంగా 39 మందికి ఇళ్ల పంట్టాలు, 453 ధ్రువీకరణ పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ కౌన్సిలర్ వెంకట లక్ష్మి కుమారి, కన్వీనర్ కృష్ణ మోహన్ పాల్గొన్నారు.

నేడు సేవ్ ఇండియా.. సేవ్ మణిపూర్ కార్యక్రమం

పామర్రు: మణిపూర్ రాష్ట్రంలో జరుగుతున్న హింసను ఆపాలని కోరుతూ శనివారం ఉదయం 10 గంటలకు పామర్రు నాలుగురోడ్ల కూడలి వద్ద సేవ్ ఇండియా.. సేవ్ మణిపూర్ నిరసన కార్యక్రమం జరుగుతుందని క్రైస్తవ సంక్షేమ సంఘ అధ్యక్షుడు సాల్మన్ కొల్లాబత్తుల పిలుపు నిచ్చారు. స్థానిక శివరామ కాంప్లెక్స్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిరసన కార్యక్రమంలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పౌష్టికాహార కిట్ల పంపిణీ

కూచిపూడి(మొవ్వ): గర్భిణులు, బాలితలు రక్తహీనత రాకుండా ఐరెన్, హిమోగ్లోబిన్ అధికంగా ఉండే ఆకు కూరలు, డ్రైఫ్రూట్స్, బెల్లం, పండ్లు, పాలు తదితర ఆహార పదార్థాలను అధికంగా తీసుకోవాలని మొవ్వ పీహెచ్‌సీ వైద్యాధికారిని పీ నిహారిక సూచించారు. మొవ్వ మండలం కూచిపూడిలోని రవిప్రకాష్ సిలికానాంధ్ర సంజీవని హాస్పటల్ నందు రోటరీ క్లబ్ కూచిపూడి వారి ఆధ్వర్యంలో శుక్రవారం మెటర్నల్ హెల్త్, చైల్డ్ కేర్ పై అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం క్లబ్ ఆధ్వర్యంలో డ్రైఫ్రూట్స్, పండ్లు, వేరుశనగ పప్పుండలు, ఐరన్ ట్యాబ్‌లెట్స్, సిరప్‌ల కిట్లను అందజేశారు. రోటరీ అధ్యక్ష కార్యదర్శులు కే రామాంజనేయులు, రవిబాబు పాల్గొన్నారు.

ఈ-పంట నమోదుపై వీఏఏలకు శిక్షణ

మండవల్లి: మండవల్లి వ్యవసాయ సహాయ సంచాలకుల కార్యాలయంలో గ్రామ వ్యవసాయ సహాయకులకు ఖరీఫ్-2023 ఈ పంట నమోదుపై డివిజన్ స్థాయిలో సహాయ వ్యవసాయ సంచాలకులు జి.వెంకటమణి శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా పంట పొలాల నుంచి నీటిని బయటకు తీసిన వెంటనే బూస్టర్ ఎకరానికి 20 కిలోలు, 15 కిలోల ఎంపీ కలిపి వేసుకోవాలన్నారు. జింకుధాతు లోప నివారణకు ముడి జింకు లీటరు నీటికి రెండు గ్రాముల చొప్పున ఎకరానికి 400 గ్రాములు పిచికారీ చేయాలని లేదా చలామిన్ ఎకరానికి 100 గ్రాముల చొప్పున పిచికారీ చేయాలన్నారు. పంట పొలాల నుంచి ముంపునీటిని బయటకు పనులను ఏడీఏ, ఏఓ షేక్ జరీనా పరిశీలించారు.

పేదల ఆకలి తీర్చడమే సాయి సందేశం



భక్తులకు అన్నసమారాధన చేస్తున్న నాగమోహన్

గుడ్లవల్లేరు: పట్టెడు అన్నంతో పేద వృద్ధులకు జానెడు పొట్ట నింపడమే నిజమైన ఆధ్యాత్మికతకు మార్గమని అంటున్నారు అంగలూరు షిరిడీ సాయి సేవా సంఘం వారు. అనాథ వృద్ధులు, వికలాంగులకు భోజనం పెట్టడంతో పాటు వైద్యం అందించి, దుస్తులను ఇచ్చి వెన్నంటే ఉంటున్నారు. షిరిడీ సాయిబాబా, తాజుద్దీన్, ఖాదరీబాబా వంటి అవధూతలు చూపిన మార్గం కూడా పేదవారికి ఆకలి తీర్చటమే నిజమైన ఆధ్యాత్మికత అని అంటున్నారు. ఆ సేవా సంఘాన్ని స్థాపించారు అంగలూరు గ్రామస్తులు యలమంచిలి నాగమోహన్, లక్ష్మీకుమారి దంపతులు. జ్ఞానసాయి పేరుతో అన్నసమారాధన, నిత్య సాయి పారాయణంతో ఈ సంఘం తమ ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహిస్తోంది. నాగమోహన్ మాటల్లోనే.. 2010 డిసెంబరు 25 నుంచి నిత్యం 45మందికి క్యారేజీలను ఇంటింటికీ పంపుతున్నాం. వికలాంగులు, వృద్ధులకు ఏటా దుస్తులను పంపిణీ చేస్తున్నాం. ప్రతి ఆరు నెలలకు వైద్య పరీక్షలు చేయిస్తున్నాం. గ్రామస్తులు తాను తలపెట్టిన కార్యక్రమానికి సహకరిస్తూ వస్తున్నారు.

'జగనన్న భూహక్కు భూరక్ష' పూర్తి చేయాలి

మండవల్లి: జగనన్న భూహక్కు భూరక్ష కార్యక్రమం త్వరితగతిన పూర్తి చేయాలని డీఎల్‌పీఓ కె.పూర్ణచంద్రరావు తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జగనన్న భూహక్కు భూరక్ష పథకంపై కార్యదర్శులు, సర్వేయర్లు, డిజిటల్, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లకు శుక్రవారం సమావేశం నిర్వహించారు. డీఎల్‌పీఓ మాట్లాడుతూ ఈ పథకం ద్వారా గ్రామకంఠంలో ఉన్న భూములకు రైతులకు ఆర్థిక భరోసా కలిగించి, యాజమాన్య హక్కు కల్పిస్తారన్నారు. ఇంటి పన్ను వసూళ్లు ఈ నెలాఖరునాటికి పూర్తి అయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రంథాలయాలకు ఎనిమిది శాతం చెల్లించాల్సిందిగా పేర్కొన్నారు. ఫిర్యాదులు ఏమైనా ఉంటే స్టాండింగ్ కమిటీకి రిపోర్ట్ ఫైల్ చేయాలని తెలిపారు. ఎంపీడీఓ కె.వెంకటరమణ, ఈవోపీఆర్డీ బి.ఆనందబాబు, అడ్మినిస్ట్రేటివ్ అధికారి కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.